

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం


సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు ఐ.పోలవరం మండలం గుత్తెనదీవికి చెందిన కంతేటి రామకృష్ణమూర్తి దంపతులు బుధవారం రూ.1,00,008 విరాళం అందజేశారు.



సత్యదేవునికి రూ.లక్ష విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి బాపట్ల జిల్లా మంతెనవారి పాలేనికి చెందిన మంతెన శ్రీనివాసరాజు బుధవారం రూ.లక్ష విరాళం చెక్కును ఏఈఓ కొండలరావుకు అందచేశారు.

7 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 7,288 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.20 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 6,800 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

మహిళలపై పెరిగిన అఘాయిత్యాలు



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణమూర్తి

అమలాపురం టౌన్: రాష్ట్రంలో ఇటీవల బాలికలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు ఆందోళనకరంగా ఉన్నాయని అమలాపురానికి చెందిన వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణ మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. అమలాపురంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అఘాయిత్యాలను అదుపు చేసేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక కమిటీలు వేయాలన్నారు. గంజాయి తదితర మత్తుతో దారుణాలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెట్టి, కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాలలు, పాఠశాలల వద్ద పోలీసులు ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించాలని, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కొనుకు వెంకటేశ్వరరావు, పితాని బేబీరావు, ఎ.కృష్ణవేణి పాల్గొన్నారు.

అమెరికా అధ్యక్షుల నాణేలు



కృష్ణ కామేశ్వర్ సేకరించిన అమెరికా అధ్యక్షుల నాణేలు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన నాణేల సేకరణ కర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ ఇంత వరకూ విడుదలైన అమెరికా అధ్యక్షుల డాలర్లను సేకరించి పలు ప్రదర్శనలు ఇచ్చారు. ప్రస్తుతం ఆ దేశానికి నూతన అధ్యక్షుడి ఎన్నిక జరిగిన సందర్భంగా బుధవారం ఆయన ఆ వివరాలను వెల్లడించారు. అమెరికా అధ్యక్షులుగా ఇంత వరకూ 46 మంది పనిచేయగా, ప్రెసిడెంట్ డాలర్లు మాత్రం 40 విడుదలయ్యాయి. అధ్యక్ష పదవిలో ఉన్న వ్యక్తులపై ఒక డాలర్ ముఖ విలువ గల నాణేలను విడుదల చేస్తున్నారు. ఇలా 2007 నుంచి 2011 వరకూ ప్రెసిడెంట్ డాలర్ నాణేలు పెద్ద సంఖ్యలో చెలామణి కోసం ముద్రించారు. అయితే 2012 నుంచి 2017 వరకూ సిరీస్‌లోని కొత్త నాణేలను సేకరణకర్తల కోసం మాత్రమే ముద్రించారు. ఈ ప్రెసిడెంట్ డాలర్ ఒక్కొక్క నాణెం 8.1 గ్రాముల బరువు ఉండి 26.5 మిల్లీ మీటర్ల వ్యాసం, 2 మిల్లీ మీటర్ల మందం కలిగి ఉంటుంది.

మూడు నెలలుగా జీతాల్లేవు



డీఎంహెచ్‌వో డాక్టర్ దుర్గారావు దొరకు వినతి పత్రం అందిస్తున్న 104 ప్రతినిధులు

అమలాపురం టౌన్: తమకు మూడు నెలలుగా ప్రభుత్వం వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని 104 వైద్య వాహనాల ఉద్యోగుల యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొరకు బుధవారం తమ బాధలను వినిపించారు. తమకు తక్షణమే వేతనాలు ఇచ్చే ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందించారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహిస్తే ఖర్చు తగ్గుతుందన్నారు. 2020 తర్వాత చేరిన 104 వాహనాల డ్రైవర్లు, డీఈవోలకు జీవో నెంబర్ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని అభ్యర్థించారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని, ఉద్యోగులకు ఫిట్‌నెస్ సౌకర్యాలు కల్పించాలని కోరారు.

నేటి నుంచి 'నన్నయ'లో సదస్సు

రాజానగరం: నన్నయ యూనివర్సిటీలో రెండు రోజుల పాటు నిర్వహించే 'ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం' సదస్సు గురువారం ప్రారంభం కానుంది. సెంటర్ ఫర్ ఏపీ స్టడీస్‌తో యూనివర్సిటీకి కుదిరిన ఒప్పందంలో భాగంగా కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు.

ఆపరేషన్ సిక్స్



విజ్జేశ్వరం వద్ద ఫ్లషింగ్ ఆపరేషన్ సందర్భంగా విడుదలవుతున్న నీరు

- మొక్కుబడిగా ఫ్లషింగ్ ఆపరేషన్
- గతంలో 48 గంటల పాటు నిర్వహణ
- ప్రస్తుతం 6 గంటలకు చేరిన వైనం

సాక్షి, అమలాపురం: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు సాగు, తాగునీరందిస్తూ, ఆ ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తున్న ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ నిర్వహణను ఆ శాఖ అధికారులు గాలికి వదిలేశారు. గతంలో ఎంతో శ్రద్ధగా చేసిన పనులను ఇప్పుడు తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. దీనికి ఇటీవల జరిగిన ఫ్లషింగ్ ఆపరేషన్ నిదర్శనంగా నిలిచింది. గతంలో 48 గంటల పాటు ఏకధాటిగా నిర్వహించే కార్యక్రమాన్ని కేవలం ఆరు గంటలకు తీసుకువచ్చారు.

వరదల సమయంలో..

గోదావరికి వరదలు వచ్చిన సమయంలో పెద్ద సంఖ్యలో మట్టి కొట్టుకువచ్చి కాటన్ బ్యారేజీ పాండ్ వద్ద పేరుకుపోతుంది. దీనివల్ల బ్యారేజీలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుంది. దీనివల్ల వరదల అనంతరం వచ్చే రబీ సీజన్‌కు నీటి ఎద్దడి ఏర్పడుతుంది. పూడిక సమస్య పరిష్కారానికి కాటన్ బ్యారేజీ వద్ద ఏటా క్రమం తప్పకుండా ఫ్లషింగ్ ఆపరేషన్ నిర్వహిస్తారు. దీనిలో భాగంగా ధవళేశ్వరం, బొబ్బర్లంక, విజ్జేశ్వరం వద్ద ఉన్న స్కవర్ల స్లూయిజ్‌లను ఒకేసారి ఎత్తేవారు. గతంలో ఈ ఫ్లషింగ్ ఆపరేషన్‌ను 48 గంటల (రెండు రోజులు) పాటు ఏకధాటిగా చేసేవారు. ఈ సమయంలో బ్యారేజీ నుంచి అత్యంత వేగంగా దిగువకు నీరు విడుదల కావడం వల్ల పాండ్‌లోని మేటలు వేసి ఇసుక, ఒండ్రు, బురద కొట్టుకుపోయేవి.

ఇప్పుడు ఆరు గంటలే

ఫ్లషింగ్ ఆపరేషన్‌లో క్రమంగా కొత్త ఒరవడిని అధికారులు తీసుకువచ్చారు. ఒకప్పుడు 48 గంటల పాటు చేసిన ఆపరేషన్‌ను తగ్గించుకుంటూ ఆరు గంటలకు కుదించారు. ఈ నెల 4న విజ్జేశ్వరం, 5న బొబ్బర్లంక, 6న ధవళేశ్వరం స్కవర్ల ఆపరేషన్ నిర్వహించారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మాత్రమే ఈ కార్యక్రమం జరిగింది. అలాగే మూడు స్లూయిజ్‌ల వద్ద ఒకేసారి కాకుండా మూడు రోజులు పాటు విడివిడిగా నిర్వహించారు. దీనివల్ల కనీసం 20 శాతం కూడా పూడిక తొలిగే అవకాశం లేదని ఇరిగేషన్ నిపుణులు, రైతులు చెబుతున్నారు. గత రెండు దశాబ్దాలుగా అధికారులు తీరు ఇలానే ఉంది. ప్రస్తుతం బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో 61,716 క్యూసెక్కులు ఉన్నందున ఈ ఆపరేషన్ చేపట్టారు.



ధవళేశ్వరం వద్ద నిర్వహిస్తున్న ఫ్లషింగ్ ఆపరేషన్

ఇసుక ర్యాంపుల కోసమేనా..

బ్యారేజీ దిగువన అక్టోబరు నాటికి ఇసుక ర్యాంపులు మొదలవుతాయి. మూడుచోట్ల ఒకేసారి స్కవర్ స్లూయిజ్‌లను తెరచి 48 గంటల పాటు నీరు వదిలితే ఆ ర్యాంపులు కొట్టుకుపోతాయి. ర్యాంపు నిర్వాహకులకు స్థానిక నేతల అండదండలు, వారిచ్చే మామూళ్లు అధికారుల చేతులు కట్టేస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ కారణంగానే గత రెండు దశాబ్దాలుగా ఫ్లషింగ్ ఆపరేషన్ సమయం తగ్గుతూ తగ్గుతూ ఇప్పుడు ఆరు గంటలకు వచ్చిందని చెబుతున్నారు.

గతంలో చాటింపు

గతంలో ఫ్లషింగ్ ఆపరేషన్ సమయంలో రాజమహేంద్రవరంలోని రైల్ కమ్ రోడ్డు వంతెన కదిలిపోయేదంటే ఎంత వేగంగా నీరు దిగువకు విడుదలయ్యేదో అర్థం చేసుకోవచ్చు. ఫ్లషింగ్ ఆపరేషన్ సమయంలో ప్రమాదాలు జరకుండా ఎగువన పురుషోత్తపట్నం నుంచి దిగువన గోదావరి సంగమ ప్రాంతం వరకు ఏటిగట్టును ఆనుకుని ఉన్న గ్రామాల్లో చాటింపు వేసేవారు. నీటి ఉధృతి కారణంగా నదిలో స్నానాలకు, బట్టలు ఉతికేందుకు, పశువులకు నీరు పెట్టేందుకు వెళ్లేవారు కొట్టుకుపోతారని ముందు జాగ్రత్తగా చాటింపు వేసేవారు. కానీ ఇప్పుడు ఫ్లషింగ్ ఆపరేషన్ చేస్తున్నట్టు బ్యారేజీ ఆనుకుని ఉన్న గ్రామస్తులకు కూడా తెలియడం లేదు.

10.60 లక్షల ఎకరాల ఆయకట్టు



డెల్టాలో వరిచేలు

గోదావరి డెల్టా పరిధిలో తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో 10.60 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. దీనిలో వరి ఆయకట్టు 8.96 లక్షల ఎకరాలు, వాస్తవ ఆయకట్టు సుమారు 7.50 లక్షల ఎకరాలు ఉంటుందని అంచనా. ఖరీఫ్‌లో సుమారు 18 లక్షల మెట్రిక్ టన్నులు, రబీలో 28 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం పండుతోంది. దీని మార్కెట్ విలువ రూ.10,580 కోట్లు. కొబ్బరి వంటి ఉద్యాన పంటలకు, ఆక్వా చెరువులకు డెల్టా నీరు అందుతోంది. ఇంతటి కీలకమైన గోదావరి డెల్టాకు ఆయువు పట్టు అయిన బ్యారేజీ నిర్వహణపై అధికారులు, ప్రభుత్వం శ్రద్ధ చూపాలని రైతులు కోరుతున్నారు.

తగ్గుతున్న నిల్వ సామర్థ్యం



గతం: రబీ సాగు సమయంలో కాటన్ బ్యారేజీ సమీపాన వేసిన ఇసుక మేటలు

కాటన్ బ్యారేజీ పాండ్‌లో పూడిక వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. బ్యారేజీ వద్ద నీటి నిల్వ సామర్థ్యం 2.93 టీఎంసీలు కాగా, పూడిక వల్ల ఇది 1.90 టీఎంసీలకు పడిపోయింది. ఒక టీఎంసీల నీటితో సుమారు 10,800 ఎకరాల వరి చేలకు నీటిని అందించే అవకాశముంది. రబీ సమయంలో ఒక టీఎంసీ నీరు అదనంగా ఉందంటే అది రైతులకు చాలా మేలు చేస్తోంది.



ప్రస్తుతం: రాజమహేంద్రవరం రోడ్డు కం రైలు వంతెన వద్ద ఇసుక మేటలు

పన్నుల వసూలుతోనే పట్టణాల ప్రగతి



మున్సిపల్ కమిషనర్లతో చర్చిస్తున్న ఆర్డీ నాగ నరసింహారావు

- లక్ష్యసాధన దిశగా శ్రమించాలి
- మున్సిపల్ కమిషనర్లతో రీజినల్ డైరెక్టర్ నాగ నరసింహారావు

అమలాపురం టౌన్: పన్నుల వసూలు సమర్థంగా జరిగితేనే ఆయా పట్టణాల ప్రగతి సాధ్యమవుతుందని రాజమహేంద్రవరం మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ (ఆర్డీ) సీహెచ్ నాగ నరసింహారావు అన్నారు. అమలాపురంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. అమలాపురం, రామచంద్రపురం, మండపేట, ముమ్మిడివరం, కొవ్వూరు, నిడదవోలు మున్సిపాలిటీల కమిషనర్లు, రెవెన్యూ, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, తాగునీటి సరఫరా, డ్రైనేజీ విభాగాల అధికారులు ఈ సమావేశానికి హాజరై తమ విభాగాల గురించి చర్చించారు. ఆర్డీ మాట్లాడుతూ వచ్చే మార్చి నాటికి పన్నుల లక్ష్యాలను నూరుశాతం సాధించాలని స్పష్టం చేశారు. మున్సిపాలిటీల వారీగా పన్నుల వసూలు (ప్రాపర్టీ టాక్స్)పై చర్చిస్తూ అమలాపురం మున్సిపాలిటీ కొద్దిగా వెనుకబడిందన్నారు. వసూలును వేగవంతం చేయాలని ఆదేశాలు ఇచ్చారు. తాను ఇటీవలే బదిలీపై అమలాపురం రెవెన్యూ అధికారిగా బాధ్యతలు తీసుకున్నానని, పన్నుల వసూలు లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేస్తామని ఆర్వో బి.శ్రీలక్ష్మి వివరించారు. ఆస్తి, ఖాళీ స్థలాలు, పట్టణ ప్రణాళిక విభాగాలకు సంబంధించి వివిధ కోర్టుల్లో ఉన్న కేసులు తదితర వాటిపై ఆర్డీ ఆరా తీశారు. అనంతరం తాగునీటి సరఫరా, డ్రైనేజీల నిర్వహణ విభాగాలపై సమీక్షించారు. అనంతరం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని మెప్మా భవనం వద్ద నిర్మిస్తున్న అన్న క్యాంటిన్ భవనాన్ని పరిశీలించారు.

రూ.9.55 కోట్ల వసూలు

కోనసీమ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీకి సంబంధించి ప్రైవేటు ప్రోపర్టీ టాక్స్ పరంగా 45,978 అసెస్‌మెంట్లు (భవనాలు) ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం పన్నుల వసూలు డిమాండ్ రూ.22.02 కోట్లు కాగా, నవంబర్ 5వ తేదీ నాటికి రూ.9.55 కోట్లు వసూలైంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి 191 భవనాల నుంచి పన్నుల లక్ష్యం రూ.2.87 కోట్లు కాగా ఇప్పటి వరకూ రూ.53 లక్షలు వసూలు చేశారు. ఏడు కేంద్ర ప్రభుత్వ భవనాల పన్నుల లక్ష్యం రూ.27 లక్షలు కాగా, రూ.లక్ష లోపు వసూలైంది.

త్వరితగతిన అపార్ ప్రక్రియ




సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సలీం బాషా

అమలాపురం రూరల్: ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రతి విద్యార్థి ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) కార్డు కలిగి ఉండాలని, ఆ దిశగా పాఠశాలల యాజమాన్యాలు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) సలీం బాషా అన్నారు. కలెక్టర్, కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు అమలాపురం కామనగరువులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో బుధవారం డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. దీనికి డివిజన్‌లోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు, మండల విద్యాశాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ అపార్ కార్డుల ప్రక్రియ, యుడైస్, ఎఫ్ఏ వన్ మార్కుల ఎంట్రీలపై చర్చించారు. అపార్ కార్డు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే మండల విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఏఎస్ఓ ఆదినారాయణ సీఎంఓ సుబ్రహ్మణ్యం, తాతారావు తదితరులు ప్రతి పాఠశాల ప్రగతిని సమీక్ష చేశారు. తొలుత డీఈవో సలీం బాషాకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ నంద్యాల మనోహర్ పుష్పగుచ్ఛంతో ఆహ్వానం పలికారు.

8న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

కాకినాడ సిటీ: ఈనెల 8వ తేదీన జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్నట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సీఈఓ వీవీవీఎస్ లక్ష్మణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సంబంధిత అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

గోదావరిలో కోడ్ కూసింది!



- మొదలైన మండలి ఎన్నికల వేడి
- ఏర్పాట్లలో యంత్రాంగం బిజీబిజీ
- 11న టీచర్ ఎమ్మెల్సీ నోటిఫికేషన్
- డిసెంబరు 5న పోలింగ్, 9న లెక్కింపు
- 113 మండలాల్లో 16,316 మంది ఓటర్లు
- 23 వరకు పట్టభద్రుల ఓట్ల నమోదు
- ఆర్వోగా కాకినాడ కలెక్టర్ షణ్మోహన్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పెద్దల సభలో అడుగుపెట్టే ఇద్దరు ప్రతినిధుల కోసం ఎన్నికల పోరు ఊపందుకుంది. మండలిలో ఖాళీ అయిన పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ప్రాథమిక స్థాయిలో కసరత్తు మొదలుపెట్టారు. ఇప్పటికే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. ఈ ఎన్నికకు ఓటర్ల నమోదు కూడా పూర్తయ్యింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించిన ఓట్ల నమోదు ప్రక్రియ వాస్తవానికి బుధవారంతో ముగిసినప్పటికీ ఈ నెల 23 వరకూ నమోదుకు అవకాశం కల్పించారు. ఈ విషయాన్ని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా నియమితులైన కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి బుధవారం కాకినాడలో విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించడంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ప్రజాప్రతినిధులు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుంది.

ఉమ్మడి తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల్లో 113 మండలాల పరిధిలో ఉన్న ఓటర్లు 16,316 మంది. ఇందులో పురుషులు 9,674 మంది కాగా, స్త్రీలు 6,642 మంది ఉన్నారు. వీరి కోసం 116 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాలో అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 614 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. 11 మండలాల్లో ఉన్న ఈ ఓటర్ల కోసం 12 పోలింగ్ కేంద్రాలు ఎంపిక చేశారు.

తూర్పు గోదావరి జిల్లాలో 19 మండలాల్లో 2,893 మంది ఓటర్లు ఉన్నారు. వీరి కోసం 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లాలో 20 మండలాల్లో ఉన్న 2605 మంది ఓటర్ల కోసం 20 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. కాకినాడ జిల్లాలో 21 మండలాల్లోని 3333 మంది ఓటర్ల కోసం 22 పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 22 మండలాలలో 3209 మంది ఓటర్లు కోసం 22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో 20 మండలాల్లో 3,662 మంది ఓటర్ల కోసం 20 పోలింగ్ కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు.

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఈనెల 11 నుంచి 18వ తేదీ వరకు కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం కోర్టు హాలులో నామినేషన్లు స్వీకరిస్తారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి తుది ఓటర్ల జాబితా ఇప్పటికే ప్రచురించారు. ఈ జాబితాలను జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్, ఎంఈఓ కార్యాలయాలతో పాటు పోలింగ్‌స్టేషన్‌లో హార్డ్ కాపీ, సాఫ్ట్ కాపీ అందుబాటులో ఉంచారు. ఉమ్మడి తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఈ నెల ఆరో తేదీ(బుధవారం) వరకు అవకాశం ఇచ్చారు. ఆరో తేదీ వరకు నమోదు చేసుకున్న వారి ఓటర్ల జాబితా ఈ నెల 23న ప్రచురించే డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో ఉంటాయి. ఈ నెల ఏడో తేదీ గురువారం నుంచి 23వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకున్న వారి పేర్లు డిసెంబర్ 30న ప్రచురించే తుది పబ్లికేషన్‌లో ప్రచురిస్తారు. ఇంతవరకూ ఓటు నమోదు చేసుకోని వారు ఈ నెల 23 వరకు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు.

ఎవరు అర్హులు అంటే....

ఈ నెల ఒకటో తేదీ నాటికి మూడేళ్ల ముందు డిగ్రీ పూర్తి చేసిన వారు గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చు. 15 ఏళ్ల స్టడీ పూర్తి చేసి ఉండాలి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఇప్పటి వరకు లక్షా 74 వేల 772 మంది ఓటర్లు నమోదయ్యారని నిర్ధారించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12 పోలింగ్ కేంద్రాలు, తూర్పుగోదావరి జిల్లాలో 61, ఏలూరు జిల్లాలో 45, కాకినాడ జిల్లాలో 63 పోలింగ్ కేంద్రాలు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 53, పశ్చిమ గోదావరి జిల్లాలో 65 పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. మొత్తంగా ఉమ్మడి గోదావరి జిల్లాల్లో 299 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వచ్చే మార్చి నెలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుంది.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ...

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ నెల 11న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. ఆ రోజు నుంచి నవంబరు 18 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 19న నామినేషన్లు పరిశీలన, 21న నామినేషన్లు ఉపసంహరణ ఉంటుంది. డిసెంబరు ఐదో తేదీన పోలింగ్, తొమ్మిదో తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఈ ఎన్నికలకు కాకినాడ జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల రెవెన్యూ అధికారులు వ్యవహరించనున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ముందుగా ఎన్నికలు జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల తుది జాబితాను ఇప్పటికే ప్రకటించాం. పోలింగ్‌కు సంబంధించి ప్రాథమిక స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. ఆయా జిల్లాల రెవెన్యూ అధికారులు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా ఎన్నికలను పర్యవేక్షిస్తారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో పోలింగ్ స్టేషన్లను కూడా గుర్తించి సిద్ధం చేశాం.

– షణ్మోహన్ సగిలి, రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్

క్లుప్తంగా

ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద గస్తీ

సాక్షి ఇంపాక్ట్

నిడదవోలు రూరల్: మండలంలోని పెండ్యాల, జీడిగుంట, పందలపర్రు ఇసుక స్టాక్ పాయింట్ల నుంచి రాత్రివేళల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని 'సాక్షి'లో ఈ నెల 6వ తేదీన నిశి వేళ ఇసుక దోపిడీ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దానికి అధికారులు స్పందించారు. ఇసుక ర్యాంపులతో పాటు స్టాక్ పాయింట్ల వద్ద రెవెన్యూ సిబ్బందితో నిరంతరం గస్తీ ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్లు తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ బుధవారం తెలిపారు. సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి

కాట్రేనికోన: వ్యాన్ ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. ఎస్సై ఐ.అవినాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కందికుప్ప పంచాయతీ శివారు పాన్నాడవారి గట్టుకు చెందిన పాలెపు అంజి (22) అమలాపురంలోని దేవీ ఫిషరీస్ రొయ్యల కంపెనీలో పనిచేస్తున్నాడు. కంపెనీ నుంచి బుధవారం ఇంటికి మోటారు సైకిల్‌పై వస్తుండగా చెయ్యేరు జెడ్పీహెచ్ మలుపులో ఎదురుగా వస్తున్న మినీ వ్యాన్ ఢీకొంది. తలకు బలమైన గాయం కావడంతో అంజి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని విలపించారు. తమకు న్యాయం చేయాలని రోడ్డుపై ధర్నా చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశా రు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

24, 25 తేదీల్లో వాలీబాల్ పోటీలు

అమలాపురం టౌన్: కాట్రేనికోన మండలం చిలకాయిచెరువు గ్రామంలో ఈ నెల 24, 25 తేదీల్లో ఫ్రెండ్స్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని టోర్నమెంట్ నిర్వాహకుడు, వాలీబాల్ క్రీడాకారుడు మోర్త ప్రతిష్ట తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు చెందిన బ్రోచర్లను అమలాపురంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ గంటి హరీష్ మాధుర్ బుధవారం రాత్రి విడుదల చేశారు.

కారు, స్కూటీ దగ్ధం

కాకినాడ రూరల్: కొవ్వాడ శ్రీనివాస్ నగర్‌లో బుధవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో కారు, స్కూటీ దగ్ధమయ్యాయి. వీటి యజమాని కె.శ్రీనివాసరావు అమెరికా వెళ్లారు. మంటలను గమనించిన సమీపంలోని కుమార్ అనే వ్యక్తి అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చాడు. సాలిపేట అగ్నిమాపక అధికారి సుబ్బారావు, సిబ్బంది వీరబాబు, ఉదయ్ కుమార్, సంధాని, రాంబాబుతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3.5 లక్షల ఆస్తి నష్టం జరిగిందని, రూ.10 లక్షల ఆస్తిని కాపాడగలిగామని అగ్నిమాపక అధికారి సుబ్బరావు తెలిపారు.

సర్కారు వారి కోత

- వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగుల జీతాల్లో తగ్గింపులు
- ఫేషియల్ యాప్‌ను తప్పనిసరి చేస్తూ నిర్ణయం
- నిమిషం లేటయినా ఇబ్బందే
- త్వరలోనే అన్ని శాఖలకూ తీసుకువచ్చేందుకు సన్నాహాలు



ముఖ ఆధారిత అటెండెన్స్ (ఫైల్)

సాక్షి, రాజమహేంద్రవరం/కాకినాడ సిటీ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోజుకో నిబంధనతో ఉద్యోగులను బెంబేలెత్తిస్తోంది. ఎన్నికలకు ముందు ఒకలా, అధికారంలోకి వచ్చాక మరోలా వ్యవహరిస్తున్న వారి తీరుతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాల్లో కోత విధించింది. వివరాల్లోకి వెళితే.. వైద్యశాఖలో ఫేషియల్ రికగ్నేషన్ సిస్టంను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఈ విధానాన్ని వైద్యశాఖలోని నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు వినియోగిస్తున్నారు. దీని ఆధారంగానే వారికి వేతనాలు చెల్లిస్తారు. ఫేస్ రికగ్నిషన్ (ఎఫ్ఆర్ఎస్) సిస్టంలో నమోదు కాకపోతే ఆ రోజు విధులకు గైర్హాజరైనట్లు పరిగణిస్తున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు నిర్ణీత సమయంలో విధులకు రాకపోయినా గైర్హాజరు చూపేలా యాప్‌ను రూపొందించారు. ప్రస్తుతం ఒక శాఖలో అమలవుతున్న విధానం త్వరలో అన్ని ప్రభుత్వ శాఖల్లో తీసుకొచ్చేందుకు ప్రభుత్వం రంగంసిద్ధం చేస్తోంది. దీంతో ఉద్యోగుల్లో గుబులు మొదలైంది.

ఇదీ సంగతి..

వైద్య ఆరోగ్యశాఖలో నూతన సంస్కరణలకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాంది పలికింది. ఉద్యోగుల విధుల నిర్వహణలో పారదర్శకతకు పెద్దపీట వేసింది. విధులకు ఆలస్యంగా హాజరవ్వడం, రాకపోయినా వచ్చినట్లు హాజరు నమోదు చేయడం లాంటి వాటికి చెక్ పెట్టేందుకు ఎఫ్ఆర్ఎస్ అమల్లోకి తెచ్చింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అదే విధానాన్ని కొనసాగిస్తోంది. గతంలో ఉద్యోగులకు వేతనాలను మాన్యువల్ రిజిస్టర్ ఆధారంగా వారి హాజరును పరిగణించి అందించేవారు. అనంతరం ఎఫ్ఆర్ఎస్‌ను అమల్లోకి తీసుకువచ్చారు. ఉద్యోగులు తమ ప్రాంతంలో విధులు నిర్వర్తించే సమయంలో అక్కడి నుంచే కచ్చితంగా ఈ–యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంది. ఇది తప్పకుండా పాటించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలు, వివిధ కారణాలతో ఎఫ్ఆర్ఎస్ సక్రమంగా అమలు కాలేదు. వైద్య, ఆరోగ్య శాఖలో మాత్రం నేషనల్ హెల్త్ మిషన్ కింద పనిచేస్తున్న నర్సులు, వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్లు, అటెండర్లు ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు.

25 మందికి వేతనాల్లో కోత

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్‌లో సుమారు 625 మంది ఉద్యోగులు వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఎఫ్ఆర్ఎస్‌ను నిర్లక్ష్యం చేయడంతో ఈ నెల సుమారు 25 మందికి వేతనాలు అందలేదు. దీంతో సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. ఉన్నతాధికారులతో ఆరా తీయించగా, ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో హాజరు నమోదు చేసుకోకపోవడంతో ఇదంతా జరిగిందని గ్రహించారు. ఇకపై ఇలాంటి తప్పులు చేయబోమని ఉన్నతాధికారులకు సంజాయిషీలు ఇచ్చుకుని తమ వేతనం జమ అయ్యేలా చూడాలని కోరారు. ఉద్యోగుల అభ్యర్థనను ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తే వేతనాలు జమ అవుతాయి. లేదంటే కోత తప్పదు.



కాకినాడలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం

ఇకపై తప్పనిసరి

అన్ని ప్రభుత్వ శాఖల్లో ఇకపై ఎఫ్ఆర్ఎస్ తప్పనిసరి చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు త్వరలోనే వెలువడనున్నట్లు సమాచారం. ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు అప్పట్లో టీడీపీ నాయకులు ఈ విధానాన్ని వ్యతిరేకించారు. ఉద్యోగులను రెచ్చగొట్టి అప్పటి ప్రభుత్వంపై విమర్శలు చేయించారు. ఇప్పుడు వారు అధికారంలోకి వచ్చాక ఆ విధానాన్నే అమలు చేస్తున్నారు.

కాకినాడ జిల్లాలో 166 మందికి..

కాకినాడ జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేసే 166 మందికి పైగా ఉద్యోగుల జీతాల్లో కోత పడింది. దీంతో సర్కారు తీరుపై ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. తాజాగా విధులకు ఆలస్యంగా హాజరైనా జీతంలో కోత తప్పదని అధికారులు హెచ్చరించడంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. కోవిడ్ విపత్తు సమయంలో వైద్య, ఆరోగ్య శాఖ అందించిన సేవలు ఎనలేనివి. కరోనా వైరస్ ప్రపంచ వ్యాప్తంగా మనుషుల ప్రాణాలను హరిస్తున్నా, మన రాష్ట్రంలో మాత్రం ధైర్యసాహసాలతో కరోనా రోగులకు సేవలందించారు. విధి నిర్వహణలో పలువురు ప్రాణాలు కూడా కోల్పోయారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం వైద్య, ఆరోగ్య సేవలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోంది. 108, 104 ఉద్యోగులకు జీతాలు ఇవ్వడంలో జాప్యం చేస్తూ వారిని అయోమయానికి గురి చేస్తోంది. ఇదే మాదిరిగానే ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జీతాల్లో కోత పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తోందని ఆ విభాగంలోని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గత నెలలో కురిసిన వర్షాల వల్ల కొంత మంది విధులకు వెళ్లడంలో కాస్త ఆలస్యమైంది. కొద్ది నిమిషాలు ఆలస్యం అయిన వారికి సైతం కూటమి సర్కారు జీతాల్లో కోత వేసింది.

గత ప్రభుత్వంలో ఇలా..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గ్రామాల్లోనే విలేజ్ హెల్త్ క్లినిక్‌లను స్థాపించింది. ఇక ఆస్పత్రులకు వైద్యులు సక్రమంగా రావడం లేదనే ఫిర్యాదులపై స్పందించి ఫేషియల్ అటెండెన్స్ విధానాన్ని తీసుకొచ్చి పారదర్శక పాలనకు పెద్దపీట వేసింది. ఈ ఫలితంగా ఉద్యోగులు సమయానికి విధులకు హాజరై సేవలందించేవారు. ఇప్పుడు కూడా ఈ విధానమే అమలవుతోంది.

ఉద్యోగుల ఆవేదన

జిల్లా వ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం కింద మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు (ఎంఎల్‌హెచ్‌పీలు) 410 మంది, స్టాఫ్ నర్సులు 54 మంది, మెడికల్ ఆఫీసర్లు 47 మంది, ల్యాబ్ టెక్నీషియన్లు 46 మంది, ఫార్మసిస్టులు 54 మంది, అటెండర్లు, వాచ్‌మెన్లు 39 మంది, సెకండ్ ఏఎన్‌ఎంలు 124 మంది వరకు పని చేస్తున్నారు. వీరికి ప్రతి నెలా 21 నుంచి 25వ తేదీ వరకు జీతాలు జమ చేస్తారు. ఇప్పుడు వీరిలో 166 మందికి పైగా ఒకటి నుంచి ఎనిమిది రోజుల వరకూ జీతాల్లో కోత పడినట్లు ఉద్యోగులు చెబుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎఫ్ఆర్ఎస్‌కు అనుసంధానం ఉన్నప్పటికీ జీతాల్లో కోతలు లేవన్నారు. కానీ కూటమి ప్రభుత్వం తమ జీతాల్లో కోత విధిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

10న అమలాపురంలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ హరీష్ మాధుర్, చెస్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో ఈనెల 10వ తేదీన రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కవురు జగదీష్ తెలిపారు. టోర్నమెంట్ నిర్వహణకు సంబంధించి స్థానిక దొమ్మేటి వారి వీధిలో బుధవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తాడి వెంకట సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జగదీష్ మాట్లాడుతూ ఈ పోటీల్లో విజేతలకు రూ.5 లక్షల విలువైన నగదు బహుమతులు అందజేస్తామన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి చెస్ క్రీడాకారులు పోటీలకు హాజరుకానున్నారని తెలిపారు. అండర్– 7 నుంచి అండర్ – 15 వరకూ విభాగాల వారీగా బాలురు, బాలికలతో పాటు ఓపెన్ కేటగిరీల్లో కూడా పెద్ద వారికి సైతం పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్త కలవారు ఈ నెల 8వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు పేర్లు నమోదు చేయించుకోవాలని జిల్లా అసోసియేషన్ కార్యదర్శి వెంకట సురేష్ సూచించారు. సమావేశానంతరం స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ గంటి హరీష్ మాధుర్ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్‌కు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తలంక సుధీర్, కోశాధికారి పరమట సుబ్రహ్మణ్యం, అసోసియేషన్ సభ్యులు ముషిణి మురళీధర్, బళ్ల పార్థసారథి పాల్గొన్నారు.

పథకం ప్రకారమే శలపాక హత్యలు

- ఇరు కుటుంబాల మధ్య తగదాలే కారణం
- ఐదుగురు నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ రఘువీర్ విష్ణు

కాకినాడ రూరల్: కాజులూరు మండలం శలపాక గ్రామంలోని చిన హరిజనపేటలో దీపావళి రోజు రాత్రి జరిగిన మూడు హత్యలను పథకం ప్రకారమే చేశారని కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు తెలిపారు. సర్పవరం జంక్షన్ సమీపంలోని కాకినాడ రూరల్ సర్కిల్ స్టేషన్‌లో బుధవారం మధ్యాహ్నం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ ఘటనకు సంబంధించి ఐదుగురు నిందితులను మంగళవారం సాయంత్రం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఎదురెదురు ఇళ్లలో ఉంటున్న బత్తుల చిన్నయ్య, పొట్లకాయల నాగేశ్వరరావు కుటుంబాల మధ్య నెలకొన్న మనస్పర్థలే ఈ హత్యలకు కారణం. ఈ గొడవలో బత్తుల చిన్నయ్య, బత్తుల రాజు, బత్తుల రమేష్ బలి అయ్యారు. ఈ కేసులో పొట్లకాయల నాగేశ్వరరావు, పొట్లకాయల బేబీ, పొట్లకాయల సుబ్రహ్మణ్యం, పొట్లకాయల దొరబాబు, పొట్లకాయల వినోద్‌లపై గొల్లపాలెం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి కాకినాడ కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. ఈ ఘటనలో గాయపడిన బత్తుల శ్రీను ఆస్పత్రిలో కోలుకుంటున్నాడు. కాగా.. నిందితురాలు బేబీ పట్ల చిన్నయ్య అవమానకరంగా మాట్లాడడం, దుర్భాషలాడడం చేసేవాడు. దీంతో నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు పథకం ప్రకారం హత్యలకు పాల్పడ్డారు. దీపావళి రోజు రాత్రి నాగేశ్వరరావు, ఆయన భార్య బేబీ, కుమారులు సుబ్రహ్మణ్యం, దొరబాబు, వినోద్‌లు ఇనపరాడ్డు, మంచం పట్టి, కర్రలతో దాడి చేసి బత్తుల చిన్నయ్య, ఆయన కుమారుడు రమేష్, సోదరుడు రాజులను హత్య చేశారు. వారిని కాపాడేందుకు వచ్చిన బత్తుల శ్రీనుపై దాడి చేశారు. చిన్నయ్య, రమేష్, రాజు అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీను ప్రాణాలు దక్కించుకుని వైద్యం పొందుతున్నాడు. కాగా.. హత్యలకు నిందితులు వినియోగించిన ఇనపరాడ్డు, మంచం పట్టి, కర్రలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో రూరల్ సీఐ చైతన్య కృష్ణ, గొల్లపాలెం ఎస్సై మోహన్ కుమార్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు

ప్రత్తిపాడు: ఆటోడ్రైవర్‌పై ప్రత్తిపాడు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామానికి చెందిన బాలిక ఒమ్మంగిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. రాచపల్లికి చెందిన ఆటోలో ప్రతి రోజూ పాఠశాలకు వెళ్లేది. ఈ నేపథ్యంలో ఆ బాలిక ఈ నెల 30న పాఠశాలకు వెళ్లి అదృశ్యమైంది. ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం అదృశ్యం కేసు నమోదు చేశారు. అయితే ఆ బాలికను నిత్యం పాఠశాలకు తీసుకువెళ్లే ఆటోడ్రైవర్ పెదిరెడ్డి కృప తీసుకుపోయినట్టు గుర్తించారు. దీంతో బాలిక అదృశ్యం కేసును మార్చి ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు చేశారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరావు కేసు దర్యాప్తు చేపట్టారు.

అల్లవరంలో చోరీలు

అల్లవరం: మండల కేంద్రమైన అల్లవరంలో పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో మంగళవారం రాత్రి నాలుగు చోట్ల పలు షాపుల్లో చోరీలు జరిగాయి. అల్లవరం వంతెన పక్కనే మద్యం షాపు వెనుక వైపు తలుపులను పెకలించి మద్యం బాటిళ్లను చోరీ చేశారు. శివాలయం సమీపంలో గమిడి సూరిబాబు బియ్యం షాపును లూటీ చేశారు. షాపులోని బియ్యం, నగదు తీసుకుపోయారు. మరో సోడా షాపు, రెస్టారెంట్లలో దొంగతనాలు జరిగాయి. ఈ మేరకు బాధితులు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. కాగా. అక్టోబర్ 23న బోడసకుర్రులోని బ్రాందీషాపు, 24వ తేదీ రాత్రి దేవగుప్తంలోని నవ్యశ్రీ బట్టల షాపు, హైస్కూల్ వద్ద కనకదుర్గమ్మ ఆలయంలో చోరీలు జరిగాయి. ప్రధాన రహదారుల చెంతనే ఉన్న షాపులను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు.

చెత్త నుంచి మంట రేగి కారు దగ్ధం

మండపేట: చెత్త నుంచి నిప్పు రాజుకుని పక్కనే ఉన్న కారు కాలిపోయింది. వివరాల్లోకి వెళితే.. నాయుళ్ల గుడి వీధిలోని కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయం ఎదురుగా గుడికి సంబంధించిన పార్కింగ్ ప్రదేశం వుంది. అక్కడ ఓ కారును గుర్తు తెలియని వ్యక్తులు పార్కింగ్ చేశారు. ఆ కారు కింద వరకూ చెత్త, గడ్డి పేరుకుపోయింది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా చెత్తలోంచి నిప్పు పుట్టింది. అది కారు వరకూ ఎగబాకడంతో మంటలు ఎక్కువయ్యాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే కారు ముందు చక్రాలు, ఇంజిన్ భాగం కాలిపోయింది. చిన్న పిల్లలు సిసింద్రీలు వెలిగించి చెత్తలో పడేయ్యడంతో మంటలు రేగినట్టు భావిస్తున్నారు.

అంతర్ జిల్లాల స్కేటింగ్ పోటీలు ప్రారంభం



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ మున్సిపల్ స్కేటింగ్ రింక్‌లో అంతర్ జిల్లాల స్కేటింగ్ పోటీలు, ఎంపికలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిర్వాహకులు ప్రారంభోత్సవం లేకుండానే పోటీలను ప్రారంభించారు. రింక్–1 బాలుర విభాగంలో శ్రీసూర్య లాష్యంత్ బంగారం, రెడ్డి భార్గవ్ వెండి, గంజి మహిధర్ కాంస్య పతకాలు అందుకున్నారు. బాలికల విభాగంలో నీక్షిత బంగారం, పూర్వి అన్విక రజతం, హీన ఫైజ కాంస్య పతకాలు సాధించారు. తొమ్మిది సంవత్సరాల పైబడిన విభాగంలో అనిక సుసాన్ బంగారం, నాగ జ్యోత్స్న రజతం, వనమాడి మధుబాల కాంస్య పతకాలు గెలుచుకున్నారు. బుధవారం నిర్వహించిన పోటీలను సంఘ అధ్యక్షుడు ఆర్.రాజగోపాల్, కార్యదర్శి కె.దొరస్వామి, కోశాధికారి సీహెచ్ రమేష్ పర్యవేక్షించారు. చీఫ్ రిఫరీగా శ్రీనివాస రెడ్డి, చైర్మన్ గంగాధర్ వ్యవహరిస్తున్నారు.

నిరంతర నిఘాతో నేరాలకు అడ్డుకట్ట



ముమ్మిడివరంలో మాట్లాడుతున్న ఐజీ అశోక్ కుమార్

ముమ్మిడివరం: నిరంతర నిఘాతో నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఏలూరు రేంజ్ ఐజీ పీజీవీజీ అశోక్ కుమార్ అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా బుధవారం ఆయన ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. అక్కడి రికార్డులను, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో తేలకుండా ఉన్న హత్య, ఇతర కేసుల వివరాలు తెలుసుకున్నారని, వీటిని ఛేదించడానికి ప్రత్యేక టీములను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించామన్నారు. ఐదేళ్లగా వివిధ అసాంఘిక కార్యకలాపాల కేసులలో ఉన్న వ్యక్తుల వివరాలు, వేలిముద్రలు సేకరించడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఫ్లెక్సీల కారణంగా వివాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వీటిపై రెవెన్యూ, పంచాయతీ అధికారులు సమన్వయంతో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రాంతంలో మోటారు సైకిళ్ల ద్వారా గంజాయి రవాణా, అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిసిందని, దాన్ని అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, సీఐ ఎం.మోహన్ కుమార్, ఎస్సై డి.జాల్వాసాగర్ పాల్గొన్నారు.

గర్భిణికి అరుదైన శస్త్ర చికిత్స

4.8 కేజీల బరువుతో బిడ్డ జననం



కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువుతో వైద్యులు

కొత్తపేట: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు ఒక గర్భిణికి అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ జి. దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. రావులపాలెం సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తున్న కాయల తబితా జ్యోతి బుధవారం ప్రసవం కోసం కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. ఆమెను వైద్యులు పరీక్షించి పాలిహైడ్రామ్నియోస్ (ఉమ్మి నీరు ఎక్కువగా ఉండటం), స్థూలకాయత్వం (90 కేజీల అధిక బరువు ఉండటం)తో పాటు కడుపులో బేబీ బరువు కూడా చాలా ఎక్కువగా ఉన్నట్టు నిర్ధారించారు. వెంటనే ఆపరేషన్ చేయాలని గర్భిణి కుటుంబ సభ్యులకు తెలిపారు. వారి అంగీకారంతో ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ ఎన్.అన్నపూర్ణ, డాక్టర్ ఎం.దుర్గాకుమారి, డాక్టర్ కె.లత, మత్తు వైద్య నిపుణులు డాక్టర్ వీరబాబు, స్టాఫ్ నర్స్ నాగమణి మేనేజ్‌మెంట్ ఆపరేషన్ విజయవంతంగా చేసి, 4.8 కేజీల బరువైన ఆడబిడ్డను బయటకు తీశారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని డాక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు.

పారా మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా శాంతి కుమార్



అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ పారా మెడికల్ బోర్డు ప్రైవేటు కాలేజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా అమలాపురానికి చెందిన దేవరపల్లి శాంతి కుమార్ ఎన్నికయ్యారు. విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలోని ఏపీ హెల్త్ కేర్ ప్రొఫెషన్ కౌన్సిల్ భవనంలో మంగళవారం రాష్ట్ర అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అకడమిక్ టైమ్ టేబుల్‌లో మార్పు చేయాలని, రిజిస్ట్రేషన్ విషయంలో జాప్యం జరగకుండా చూడాలని పారా మెడికల్ బోర్డు సెక్రటరీ బి.సుమైలకు శాంతి కుమార్ వినతి పత్రం అందించారు.

విచారణకు వచ్చారా.. భయపెడుతున్నారా..



ఉప్పలపాడులో విచారణ చేస్తున్న అధికారులు

- ఏపీడీని నిలదీసిన ఉప్పలపాడు గ్రామస్తులు
- ఉపాధి నిధుల అవకతవకలపై విచారణ

గండేపల్లి: మమ్మల్ని భయపెట్టడానికి వచ్చారా, విచారణకు వచ్చారా అంటూ ఏపీడీని ఉలవపాడు గ్రామస్తులు నిలదీశారు. వివరాల్లోకి వెళితే.. ఉప్పలపాడులో ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగమయ్యాయని ఆ గ్రామానికి చెందిన మేడిబోయిన శ్రీను, సత్తి సోమరాజు, అడబాల సత్యనారాయణమూర్తి, అంకం ఓం కృష్ణ, నూకతట్టు వెంకటరమణ తదితరులు అక్టోబర్ 7న కాకినాడ కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏపీడీ ఎం.భానుప్రకాష్ బుధవారం ఆ గ్రామ పంచాయతీ వద్ద విచారణ ప్రారంభించారు. అయితే ఫిర్యాదుకు తగిన ఆధారాలు, సాక్ష్యాలు ఉన్నాయా అంటూ ఫిర్యాదుదారులను ఆయన ప్రశ్నించారు. విచారణ జరిపితే అసలు విషయం తెలుస్తుందని వివరించినప్పటికీ ఆయన పట్టించుకోలేదు. దీంతో ఫిర్యాదుదారులు పైవిధంగా స్పందించారు. ఎట్టకేలకు ప్రారంభమైన విచారణలో ఫీల్డ్ అసిస్టెంట్ తలారి వెంకటరమణపై పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. పనులకు రాకుండానే వచ్చినట్టుగా ఫీల్డ్ అసిస్టెంట్ తన బంధువులు, గ్రామంలో పలువురి పేరిట మస్తర్లు నమోదు చేసినట్టు విచారణలో ఏపీడీకి గ్రామస్తులు తెలియజేశారు. గ్రామంలో లేని వారిని, ఇతర ప్రాంతాలలో వేరే పనులు చేసుకుంటున్న వారిని కూడా మస్తర్లలో చేర్చినట్టు వివరించారు. ఏపీడీ మాట్లాడుతూ సేకరించిన వివరాలతో నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ ఎన్.గంగా భవాని, ఈసీ రమేష్, పంచాయతీ కార్యదర్శి తరంగిణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెప్మా కార్యకలాపాల డిజిటలైజేషన్



సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ప్రియంవద

రాజమహేంద్రవరం సిటీ: సంక్షేమ కార్యక్రమాలను అర్హులకు సక్రమంగా చేరేలా మెప్మా కార్యకలాపాలను డిజిటలైజేషన్ చేస్తున్నట్టు పీడీ బి.ప్రియంవద అన్నారు. ఈ ప్రక్రియపై తూర్పు గోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల మెప్మా సీఓలు, రిసోర్స్ పర్సన్లు, సిబ్బందికి బుధవారం రాజమహేంద్రవరంలోని వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ అప్ లోడింగ్, వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ప్రాజెక్టు డైరెక్టర్ బి.ప్రియంవద మాట్లాడుతూ పట్టణాల పరిధిలోని స్వయం సహాయక సంఘాల పూర్తి సమాచారాన్ని ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్‌లో పొందుపరచామన్నారు. సభ్యుల డేటా పారదర్శకంగా ఉండేందుకు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన అందరికీ చేరవేసేందుకు ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో టీఎంసీ పి.శ్రీదేవి, సిటీ మిషన్ మేనేజర్లు, టీఎంసీలు పి.రవిశంకర్, కె.మోహన్ కుమార్, టి.అనంతలక్ష్మి, డి.మంగాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.